క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



సిరులతల్లి సన్నిధిలో భక్తులు, అర్చకులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జీవీఎంసీ గాంధీ పార్కులో వేడుకల్లో దివ్యాంగులు, వీహెచ్‌పీఎస్ సభ్యులు

సీతమ్మధార: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ కార్యదర్శి ఎస్.మల్లేశ్వరి మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచేలా పోరాడిన ఘనత మందకృష్ణకు దక్కుతుందన్నారు. దివ్యాంగులకు టిడ్కో ఇల్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జాతీయ నాయకులు ఆల్బర్ట్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పైడిశెట్టి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



ఓంకారం రూపంలో దీపాలు వెలిగించిన విద్యార్థులు

దాబాగార్డెన్స్: కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో పూజలు, దీపారాధన చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ కార్తీక మాసం ప్రారంభమైనప్పటి నుంచి దీపారాధన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ సభ్యులు పి.నల్లరాజు, కనక మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం సేవలు భేష్



నిరాశ్రయులకు క్షవరం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

సీతమ్మధార: కంచరపాలెంకి చెందిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఆర్కే సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లో గల ఏయూటీడీ – జీవీఎంసీ షెల్టర్‌లో మంగళవారం మానవసేవే మాధవసేవ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి వసతిగృహంలో గల పలువురు నిరాశ్రయులకు నాయీబ్రాహ్మణులు ఉచితంగా క్షవరం చేశారు. వారికి ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో మల్లువలస రాధాకృష్ణ, కుమార కొండబాబు, దాసరి రవి, గులిమి ప్రవీణ్ కుమార్, కింతాడ అప్పారావు పాల్గొన్నారు.

నిత్యం లీకులే..!

అధ్వానంగా నీటి సరఫరా పైప్‌లైన్ • నడిరోడ్డుపైనే లీకేజీతో తాగునీరు వృథా



జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ చాకలిపేట వద్ద...



ప్రెస్‌క్లబ్ జంక్షన్ వద్ద లీకవుతున్న పైప్‌లైన్



జిల్లా పరిషత్ జంక్షన్ సమీపాన రోడ్డు మధ్యలో పైప్‌లైన్ లీక్ కారణంగా వృథాగా పోతున్న నీరు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో నగర పౌరులకు రోజూ 460 ఎంఎల్‌డీ నీరు అవసరం. కానీ 400 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు. ఇదిలా ఉండగా సరఫరా చేసిన నీటిలో 25 శాతం వృథాగా పోతోందని స్వాక్షాత్తు కమిషనర్ సంపత్‌కుమారే ఇటీవల తెలిపారు. అందుకు కారణాలు పరిశీలిస్తే నిత్యం ఎక్కడో చోట పైప్‌లైన్లు లీకై విలువైన నీరు వృథా కావడమే అని తెలుస్తోంది. అసెస్‌మెంట్‌దారులు పైపులైన్లు సరి చేసుకోకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో క్లోరిన్‌టెడ్ నీరు వృథాగా పోతోంది. మరోవైపు సంబంధిత సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించడం లేదు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో సుమారు 2 లక్షల పైబడి జనాభా నివసిస్తున్నారు. సుమారుగా 50 నుంచి 60 వేల అసెస్‌మెంట్లు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో 50 వేల పైబడే మంచినీటి కనెక్షన్లు ఉన్నాయన్నమాట. నీటి కనెక్షన్లు ఉన్న వాటిలో చాలా వరకు పైప్‌లైన్లు తుప్పు పట్టి పాడైపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలో మంచినీటి పైప్‌లైన్లు కలిసిపోయాయి. ఎప్పటికప్పుడు పరిశీలించుకోవల్సిన మంచినీటి కుళాయి కనెక్షన్ కలిగిన (అసెస్‌మెంట్ దారులు) వారు దృష్టి సారించకపోవడంతో మరమ్మతులకు గురవుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు డ్రైనేజీలో కలిసిపోయి ఉన్నాయి. నిత్యం మురుగునీటిలో ఉండడంతో అవి పూర్తిగా తుప్పు పట్టేసి దెబ్బ తింటున్నాయి. ఫలితంగా లీకులు ఏర్పడుతున్నాయి.

నిత్యం ఏదో ఒక ప్రాంతంలో..

నియోజకవర్గ పరిధిలో నిత్యం 10 నుంచి 12 పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో మంచినీటి సరఫరాలో లీకులు ఏర్పడుతున్నాయి. దశాబ్దాల కిందట వేసిన పైపులు తుప్పు పట్టేయడంతో లీకై నీరు వృథాగా పోతోంది. ఫలితంగా నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల ప్రజలకు నీటి సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతోంది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి లీకేజీలు అరికట్టడంతో పాటు అవసరమైన చోట పూర్తిస్థాయిలో పైపులు మార్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

లీకేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాం..



జీవీఎంసీ పరిధిలో నగర పౌరులకు రోజూ 460 ఎంఎల్‌డీ నీరు అవసరం. ప్రస్తుతం 400 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేయగలుగుతున్నాం. పంపింగ్ లోపం కారణంగా పూర్తి స్థాయిలో సరఫరా చేయలేకపోతున్నాం. ఇదిలా ఉండగా రోజూ జీవీఎంసీ పరిధిలో పైప్‌లైన్ల లీకులపై 25 వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. అసెస్‌మెంట్ దారులు ఎప్పటికప్పుడు తాగునీటి పైపులైన్లు సరిచూసుకోవాలి. చాలా మంది నిర్లక్ష్యంగా ఉండడం వల్ల అవి తుప్పు పట్టి పోవడంతో నీరు వృథాగా పోతుంది.

–సంపత్‌కుమార్, కమిషనర్, జీవీఎంసీ

కూటమి ప్రభుత్వం ఒక్క సిక్సూ కొట్టలేదు

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- నిరుపేదకు రూ.5వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా పేదవాడికి ఒక్క సంక్షేమ పథకం కూడా అందించలేదని, ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని హామీలిచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క సిక్స్ కూడా కొట్టలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదను మంగళవారం ఆయన ఆదుకున్నారు. పేదలకు అందిస్తున్న సహాయ సహకారాల్లో భాగంగా 38వ వార్డుకి చెందిన చేపల బంగార్రాజుకు ఆశీల్‌మెట్టలో గల కార్యాలయంలో రూ.5వేలు అందజేశారు. మదర్ థెరిస్సా, బాబాసాహెబ్ అంబేడ్కర్ అడుగు జాడల్లో పేదలకు అందిస్తున్న ఆర్థిక సాయం తనకెంతో సంతృప్తినిస్తోందని వాసుపల్లి తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మెరుగైన విద్య, వైద్యం పేదలకు అందించారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. జగనన్న హయాంలో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారని, ప్రస్తుతం మెడికల్ కాలేజీలు, నూతన పోర్టు నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు అందాల్సిన భరోసా, బడ్జెట్లో నిధులు కూడా కేటాయించలేదని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పునరాలోచన చేసి జగనన్న అందించిన సంక్షేమ ఫలాలు పేదలకు చేరవేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, అలపున కనకారెడ్డి, లింగం శ్రీను, ముజీబ్‌ఖాన్, కృష్ణా, మహేష్‌బాబు అభిమానుల సంఘం అధ్యక్షుడు అప్పారావు, గనగళ్ల రామరాజు, చింతకాయల వాసు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



గొల్లవీధిలో మురుగుకాలువ పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్ – 4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని బబ్బర్‌తోట, గొల్లవీధి ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ ప్రజలు తాగుతున్న మంచినీటిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాతటైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఇంటి ఆవరణలో ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆయన వార్డులోని కాలువలు, రహదారులు పరిశీలించారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త తీసుకెళ్లాలని, వీధుల్లోని చిన్న చిన్న కాలువలను రోజూ శుభ్ర పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తాగునీటి సరఫరా విభాగం అధికారులు మురళీకృష్ణ, వాసుదేవన్, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

29 నుంచి బిజినెస్ ఎక్స్ పో



మాట్లాడుతున్న చిట్టూరి శ్రీనాథ్

సీతమ్మధార: విజయవాడలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు మూడు రోజులపాటు ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్ పో – 2024 నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) చైర్మన్ శ్రీనాథ్ చిట్టూరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్లో 'ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో – 2024' నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. ఎక్స్ పోలో ఏర్పాటు చేయడానికి స్టాల్స్ ఖరారు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ ఛాప్టర్ ఉపాధ్యక్షులు శోభన్ ప్రకాష్, మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు

దాబాగార్డెన్స్: డిసెంబర్ 2 నుంచి ప్రారంభం కానున్న కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి పోస్టర్ అందజేశారు. ఈ సందర్భంగా తొలి గురువారం పూజలో పాల్గొనాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

7న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవస్థానంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా 6న సాయంత్రం ఉత్సవమూర్తుల తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ముందుగా అర్చకులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి



మాట్లాడుతున్న పీకే పట్నహాని, నాయకులు

తాటిచెట్లపాలెం : రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ అహర్నిశలు కృషి చేస్తోందని యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పీకే పట్నహాని తెలిపారు. డిసెంబర్ 4, 5, 6న నిర్వహించే రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ప్రచారం కోసం విశాఖపట్నం విచ్చేసిన పీకే పట్నహాని మంగళవారం దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, జోనల్ స్థాయిలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ కార్మికుల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఎన్నికల్లో శ్రామిక్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్ రావు మాట్లాడుతూ యాజమాన్యంతో రాజీ లేని పోరాటం చేశామన్నారు. ఈ నెల 29న మద్రిపాలెంలో నిర్వహించే శ్రామిక గర్జన సభకు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జోనల్ అధ్యక్షుడు పీవీజే రాజు, జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



యూపీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలోని తోటగరువు యూపీహెచ్‌సీని కలెక్టర్ హరేందిర ప్రసాద్ మంగళవారం సందర్శించారు. అక్కడి రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబొరేటరీలో రోగులకు జరిపిన వైద్య పరీక్షల రికార్డును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ సంఖ్య, రోగులకు అందించే మందులు, ప్రస్తుతం నిల్వ ఉన్న మందుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో అందాల్సిన వైద్య సేవల గురించి సూచనలు ఇచ్చారు. ఓపీ సంఖ్యను పెంచే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



ఆదిత్య కళాశాలలో రాజ్యాంగ పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ప్రేమానంద్, ప్రిన్సిపాల్ కదారి కుమార్



ఏవీఎన్ కళాశాలలో రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేస్తున్న ఏయూ ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు



జీవీఎంసీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

దాబాగార్డెన్స్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దాబాగార్డెన్స్‌లో గల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి రాజకీయ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు, అంబేడ్కర్‌వాదులు, దళితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

- దాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రేమానంద మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కదారి కుమార్, ఏయూ పొలిటికల్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పీవీ రామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జీ, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక ఏవీఎన్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు పాల్గొని రాజ్యాంగ విలువలను వివరించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అధ్యాపకులు శంకర్‌నారాయణ, జె.రామారావు, జి.సునీత, సుమితాదాస్, అర్చన, గాంధీ, స్వరాజ్యలక్ష్మి, పైడి రజని, కె.మల్లిక, అనంతలక్ష్మి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.
- రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, విదసం ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దాబాగార్డెన్స్‌లో గల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, డాక్టర్ బి.నాగమణి, జి.జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ ఎల్.లావణ్య, డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.
- అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో రెల్లివీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు పాల్గొని రాజ్యాంగ విలువలు తెలియజేశారు. విద్యార్థులు అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సీపీ పుస్తకాలు అందజేశారు. అంబేడ్కర్ యువసేన గౌరవ అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావు, అధ్యక్షుడు మాడుగుల సత్యనారాయణ, బండి సురేంద్ర, ఏఎస్ఐ అనురాధ, ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, కమలాకర్, మాడుగుల భాస్కరరావు, చొక్కాకుల రాంబాబు, స్వరూప్, సంఘంరెడ్డి మల్లేశ్వరరావు, సంఘం సభ్యులు కాకర అప్పారావు, కటారి రమేష్, దళమంతుల సుశీల, మూర్తి, బండి శివ, బంగారి సింహాచలం, తుపాకుల ఈశ్వరరావు పాల్గొన్నారు.

జగదాంబ: జోన్ – 4 కార్యాలయంలో జెడ్సీ మల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బందితో కలిసి రాజ్యాంగం అమలుకు ప్రతిజ్ఞ చేశారు.

మహారాణిపేట: కేజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులు, సిబ్బందితో భారత రాజ్యాంగం చదివించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహన్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ కిరణ్ కుమార్, ఏవో మంగరాజు, మేనేజర్ పీఎం జవహర్‌లాల్ పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కుశలవ ఇంటర్నేషనల్, ఎస్ఆర్ అకాడమిక్ ఆర్గనైజేషన్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మిషన్ ఆపరేటర్స్, షిఫ్ట్ సూపర్‌వైజర్స్, సేల్స్ అండ్ సర్వీస్ ఇంజినీర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18–35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు.

'ఆరుద్ర కవిత' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: అవంత్స సోమసుందర్, ఆరుద్ర శత జయంతి ఉత్సవాలు ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, అరసం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏయూ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అరసం ప్రచురించిన 'ఆరుద్ర కవిత' పుస్తకాన్ని వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వై.విజయకుమార్, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు మేడిపల్లి రవికుమార్, ఆచార్య చందు సుబ్బారావు, అరసం నాయకులు ఉప్పల అప్పలరాజు, క్షేత్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకల్పబలంతో కాలినడకన తిరుమలకు..



సీతమ్మధార నుంచి కాలినడకన బయలుదేరిన గోవింద మాలధారులు

సీతమ్మధార : సంకల్ప బలంతో ఏదైనా సాధించ వచ్చని విశాఖ నాగరానికి చెందిన వృద్ధ మిత్రులు నిరూపిస్తున్నారు. ఆరు పదుల వయస్సు దాటినా సరే ఉత్సాహం, దైవ భక్తితో గోవింద మాల ధరించి సీతమ్మధార నుంచి మంగళవారం ఉదయం తిరుమల వేంకటేశ్వరుని సన్నిధికి కాలినడకన బయలుదేరారు. 21 రోజులపాటు సాగే ఈ యాత్ర యువతలో స్ఫూర్తి నింపుతుందని 15 సార్లు కాలినడకన తిరుమల యాత్ర చేసిన డి.వెంకటరావు (67) పేర్కొన్నారు. దారిపొడవునా వేంకటేశ్వరుని గీతాలు ఆలపిస్తూ ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తామని తెలిపారు. తనతోపాటు 15 సార్లు యాత్ర చేసిన ఎస్.సన్యాసి రావు (82), ఏడు సార్లు యాత్ర చేసిన డి.ఎ స్.ఎన్.మూర్తి (65), తొలిసారి రామ్మూర్తి రాజు (74) వస్తున్నారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో రైలు మార్గంలో విశాఖ వస్తామని తెలిపారు.